సాక్షి
సంగారెడ్డి
గురువారం । 7 । ఆగస్టు । 2025



గొల్లభామ శోభితం

సిద్దిపేట జిల్లా చేనేత కార్మికుల నైపుణ్యానికి ప్రతిఫలం దక్కింది.

వివరాలు 8లో ▸



ఆయిల్‌పామ్‌తో లాభాలు

ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

వివరాలు 8లో ▸



రోడ్డుపైనే పార్కింగ్

సంగారెడ్డి పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

తప్పుల్లేకుండా ఓటర్ జాబితా

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ఓటర్ జాబితాలను కంప్యూటర్లో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

హత్నూర (సంగారెడ్డి): గ్రామపంచాయతీలుగా వారీగా తప్పులు లేకుండా తుది జాబితా ఓటర్ జాబితాను తయారుచేసి పెట్టుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. హత్నూర మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ జాబితా తయారీపై కంప్యూటర్లో స్వయంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా గ్రామపంచాయతీ వారీగా, వార్డుల వారీగా కూడా ఓటర్ లిస్టును సిద్ధం చేయాలని, ఆ బాధ్యత మండల స్థాయి అధికారులపై ఉందని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటేందుకు అధికారులు అంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ఆ పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న గిరిజన నాయకులు

జహీరాబాద్ టౌన్: గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఘునాథ్ రాథోడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీమంత్రి సోయం బాబురావు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారన్నారు. దీని వెనుక పెద్ద కుట్రదాగి ఉందని, ఈ పిటిషన్‌తో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీల వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇద్దరిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.

సైనిక కుటుంబాలకు న్యాయ సేవలు అందిస్తాం



క్లినిక్‌ను ప్రారంభించిన సౌజన్య

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని సైనిక కుటుంబాలకు న్యాయపరమైన సేవలు అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా సైనిక్ బోర్డులో న్యాయ సేవల క్లినిక్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ..దేశ సరిహద్దులను కాపాడే సైనికులు తమ కుటుంబాలు ఎదుర్కొంటున్న చట్టపరమైన సమస్యల గురించి పరిష్కరిస్తామన్నారు. ప్రత్యేకంగా సేవల కోసం ఏర్పాటు చేసిన క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వాలి: మాణిక్యం



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఇళ్ల స్థలాలు కలిగి పట్టా సర్టిఫికెట్‌లు ఉన్న వారికి ఇంటి నిర్మాణాలకు అనుమతులివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని గంగారం పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఇళ్ల స్థలాల పట్టాలిచ్చి పొజిషన్ చూపెట్టి రెండేళ్లైనా నిర్మాణాలకు ఎందుకు అనుమతించడంలేదని పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. పర్మిషన్లు ఇచ్చేంతవరకు ఆందోళన విరమించమని చెప్పడంతో పంచాయతీ కార్యదర్శి తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి స్థలాల పట్టాలు ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటే అనుమతులిస్తామని, ఈనెల 15 తర్వాత తహసీల్దారు వచ్చి పరిశీలిస్తారని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

భానూరు బల్దియాకు బ్రేక్!

భానూరు గ్రామ పంచాయతీని బల్దియాగా మార్చాలనే నిర్ణయానికి బ్రేక్ పడిందా అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో రక్షణ శాఖకు సంబంధించిన సంస్థ బీడీఎల్ (భారత్ డైనమిక్స్ లిమిటెడ్) ఉంది. దీంతో ఈ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చాలంటే కేంద్రం ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరి అయింది. ఈ కారణంగానే ఈ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చాలనే నిర్ణయాన్ని విరమించుకున్నట్లు తెలుస్తోంది.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి:

భానూరు, క్యాసారం, నందిగామలతో కలిపి కొత్త బల్దియా ప్రతిపాదనలు

- బీడీఎల్ ఉండటంతో కేంద్రం నుంచి రాని అనుమతి..?
- పంచాయతీలుగానే ఈ మూడు గ్రామాలు
- ఈ మూడింటికే ఓ జెడ్పీటీసీ, ఓ ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలు

తొలుత భానూరు, నందిగామ, క్యాసారం గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా మార్చాలని భావించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. అలాగే ఈ గ్రామాలను కొత్తగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయాలనే మరో ప్రతిపాదన కూడా ప్రభుత్వ పరిశీలనకు వెళ్లింది. కానీ కేంద్రం నుంచి అనుమతి రాకపోవడంతో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. జిల్లాలో కోహీర్, జిన్నారం వంటి గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. అంతకుముందు ఇస్నాపూర్‌ను కూడా మున్సిపాలిటీ చేసింది. ఈ క్రమంలోనే భానూరును కూడా మున్సిపాలిటీగా మార్చాలని భావించినప్పటికీ, కేంద్రం నుంచి అనుమతి తప్పనిసరి కావడంతో ఈ ప్రతిపాదనలకు బ్రేక్ పడినట్లయింది.



మూడు గ్రామాలకు ఒక ఎంపీపీ, వైస్ ఎంపీపీ

పటాన్‌చెరు మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో 16 గ్రామ పంచాయతీలు వివిధ మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. ఇప్పుడు ఈ గ్రామాలు మాత్రమే పటాన్‌చెరు మండలంలో కొనసాగనున్నాయి. ఈ మూడు గ్రామాలకు ఒక ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలు ఉంటాయి. అలాగే ఐదు ఎంపీటీసీ స్థానాలతో ఈ మండల పరిషత్‌ను ప్రభుత్వం ప్రకటించింది. నిబంధనల ప్రకారం 2,500 నుంచి మూడు వేల వరకు ఓటర్లకు ఒక ఎంపీటీసీ స్థానం ఉంటుంది. అలాగే మండల పరిషత్ ఏర్పడాలంటే కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలి. భానూరులో సుమారు పది వేల వరకు జనాభా ఉండటంతో ఈ గ్రామం పరిధిలో మూడు ఎంపీటీసీలు, క్యాసారం, నందిగామ గ్రామాలకు ఒక్కో ఎంపీటీసీ స్థానం చొప్పున మొత్తం ఐదు ఎంపీటీసీ స్థానాలతో ఈ మండల పరిషత్‌ను ఏర్పాటు చేశారు. ఈ మండలానికి ఓ జెడ్పీటీసీ స్థానం కూడా ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ఐదు ఎంపీటీసీ స్థానాలకు, ఒక జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కుటుంబ ఓటర్లకు ఒకే చోట ఓటింగ్

కలెక్టర్ ప్రావీణ్య



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్/జోగిపేట(అందోల్): పటాన్‌చెరు నియోజకవర్గంలో ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నజరీ నక్షలను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన ఈఆర్‌ఓ, సహాయ రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ అధికారులతో, అందోలు–జోగిపేటలో ఆర్‌డీవో కార్యాలయంలో జిల్లా సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్ అధికారి ఐనేశ్‌తో కలిసి బుధవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...పోలింగ్ స్టేషన్లు ఆయా వార్డుల పరిధి లోపలే ఉండాలన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని మొత్తం 422 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తాము నివసించే ప్రాంతానికి సమీపంలోనే ఓటు వేసేలా మ్యాప్‌లు రూపొందించాలని సూచించారు. నియోజకవర్గ స్థాయి నజరీ నక్షను నాలుగు రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు. భూసంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. వట్‌పల్లి మండలం రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా షాహెద్‌నగర్ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో భూములపై ఉన్న సందిగ్ధతకు ఈ రీసర్వే ప్రాజెక్టు తుది నివేదికలా నిలవాలని ఆమె సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసమే ఇసుక బజార్లు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఇసుక విషయంలో ఇబ్బందులు కలగకుండా జిల్లాలో ఇసుక బజార్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అందోలు శివారులో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను ఆమె పరిశీలించారు. ఇళ్లకు తగిన మోతాదులో ఇసుకను అందించడంపై దృష్టి సారించాలన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ మాధురి, పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల సహాయ రిటర్నింగ్ అధికారులు, జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శీతల గిడ్డంగిలో అగ్నిప్రమాదం

- అన్నారం గ్రామ శివారులో ఘటన
- గోదాంలో ఫార్మా పరిశ్రమలకు చెందిన రసాయన నిల్వలు!
- మంటల్ని అదుపు చేసేందుకు రంగంలోకి 10 ఫైర్ ఇంజన్లు



గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం గ్రామశివారులోని గుబ్బ ఏ 1 శీతల గిడ్డంగిలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గుబ్బ స్టోరేజీలో రాత్రి 7:40 గంటలకు ఒక్కసారిగా మంటలు చెలరేగి పేలుడు సంభవించింది. అయితే గిడ్డంగిలో పని చేసే దాదాపు 25 మంది కార్మికులు సాయంత్రం 7 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత ప్రమాదం సంభవించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోపాటుగా గిడ్డంగిలో సామర్థ్యానికి మించి పరిశ్రమలకు చెందిన రసాయన నిల్వలు ఉంచడంతో ప్రమాదం జరిగినట్లు భద్రతా విభాగం సిబ్బంది చెబుతున్నారు. ప్రమాద సమాచారాన్ని అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని 10 ఫైరింజన్లతో మంటల్ని అదుపు చేస్తున్నారు. కాగా పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



కలెక్టరేట్‌లో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు

సంగారెడ్డి జోన్/పటాన్‌చెరు టౌన్: జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజారాణి, ఏఓ అంథోని, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పటాన్‌చెరులోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఉన్న జయశంకర్ విగ్రహానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు జిల్లాకు సీఎం రేవంత్!

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సంగారెడ్డికి వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుమార్తె జయరెడ్డి గుణ చైతన్యరెడ్డి వివాహం సంగారెడ్డిలోని రామ్‌మందిర్‌లో జరగనుంది. ఈ వివాహ వేడుకకు సీఎం హాజరయ్యే అవకాశాలున్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. సీఎంతోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీ నాయకులు ఈ వివాహ వేడుకకు హాజరయ్యే అవకాశాలుండటంతో జిల్లా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ, ఈఈఈ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకిగాను స్పాట్ అడ్మిషన్ల కోసం గురువారం సాయంత్రం 4 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సౌజన్య బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు పాలిటెక్నిక్ కార్యాలయంలో లేదా 9505504211, 8500080398, 9010273077 నంబర్లలోగానీ సంప్రదించాలని సూచించారు.

ముఖ హాజరుతోనే వేతనాలు

పేట ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్‌ఎస్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న సంగారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆధార్‌కార్డుతో ముఖహాజరు వెంటనే అమలు చేయాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ సంగారెడ్డి స్పష్టం చేశారు. ముఖ హాజరు ప్రకారమే ప్రతీ నెల వేతనాలు చెల్లిస్తామని తెలిపారు. బుధవారం సదాశివపేట ప్రభుత్వాస్పత్రిని సంగారెడ్డి తనిఖీ చేశారు. మెనూ ప్రకారమే రోగులకు భోజనం అందించకపోతే డైట్ కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలకు సిబ్బంది ప్రాధాన్యత నివ్వాలని అత్యవసరమైతేనే తప్ప శస్త్రచికిత్సలకు వెళ్లాలని సూచించారు. జూలైలో ప్రసవాల శాతం తగ్గడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయశంకర్, వైద్యులు సత్యనారాయణ, ఫార్మాసిస్ట్ భీంరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు రక్షణ కల్పించాలి

సబ్ కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి



ఉమాహారతికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలోని గురుకులాలు, వసతిగృహాల్లో విద్యార్థులకు రక్షణ కల్పించాలని బీజేపీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రాన్ని అందజేశారు. నాణ్యమైన విద్య అందుతుందని పేదలు తమ పిల్లలను గురుకులాలు, హాస్టళ్లలో చేర్పిస్తుండగా అత్యధిక వాటిల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం లేదని పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధికి కేంద్రం విడుదల చేసిన పీఎంశ్రీ నిధులు సైతం దుర్వినియోగం అవుతున్నాయని తెలిపారు. వినతి పత్రం అందజేసినవారిలో బీజేపీ ఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ఎస్సీమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్, నాయకులు దశరథ్, అంబాదాస్ ఉన్నారు.

శిఖం భూమి కబ్జా

- బ్రాహ్మణగూడ తెలంగాణ క్రీడా ప్రాంగణంలోనే ఆక్రమణ
- తాలిం చెరువులో ఐదెకరాల వరకు వరి సాగు



కబ్జా చేసిన శిఖం భూమిలో వేసిన వరినాట్లు

హత్నూర(సంగారెడ్డి): రెవెన్యూ అధికారులు కేసులు పెట్టినా...చర్యలు తీసుకున్నా శిఖం భూకబ్జాదారులు వ్యవసాయం వరి నాట్లు వేయడం మాత్రం మానడం లేదు. ఈ ఘటన మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని తాళం చెరువు శిఖం భూమి సుమారు ఐదెకరాల వరకు కబ్జా చేసి అందులో బోర్లు వేసి వరినాట్లు వేశారు. హత్నూర గ్రామ శివారులో ఉన్న తాలిం చెరువు శిఖంలో బ్రాహ్మణగూడ గ్రామానికి చెందిన తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని గత ప్రభుత్వంలో అధికారులు ఏర్పాటు చేశారు. క్రీడా మైదానానికి పైభాగంలో నర్సరీతోపాటు మరికొంత శిఖం భూమి రోడ్డుకు ఆనుకుని ఉంది. కొంతమంది శిఖం భూమిలో బోర్లు సైతం వేసి భూమిని కబ్జా చేసి కొన్నేళ్లుగా వరి నాట్లు వేస్తూ వ్యవసాయం చేసుకుంటున్నారు. గతేడాది హత్నూర గ్రామానికి చెందిన రైతులు కబ్జాకు గురైన శిఖం భూమిని కాపాడాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా కబ్జా చేసిన వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం శిఖం భూమిలో దర్జాగా బోర్లలో మోటార్లు దించి వచ్చిన నీటి ద్వారా శిఖం భూమిలో యథేచ్ఛగా తిరిగి వరి నాట్లు వేసి అధికారులకు భూ కబ్జాదారులు సవాల్ విసిరారు. హత్నూర నుంచి బ్రాహ్మణగూడ వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న శిఖం భూమి కావడంతో అందరి దృష్టి క్రీడా ప్రాంగణంలో వరి నాట్లు ఏందంటూ ఆశ్చర్యానికి లోనవుతున్నారు. కబ్జా చేసిన వారిపై కేసు నమోదుతో పాటు చట్ట రీత్యా చర్యలు తీసుకుని శిఖం భూమిని కాపాడాలని రెండు గ్రామాల రైతులు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

క్రిమినల్ కేసులు పెడతాం



“శిఖం భూమి గతంలో కూడా కబ్జాకు గురైతే కేసులు నమోదు చేశాం. ప్రస్తుతం కూడా శిఖం భూమిలో బ్రాహ్మణగూడ క్రీడా ప్రాంగణాన బోదు ఉన్న ప్రాంతంలో కొందరు భూమిని కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– పర్వీన్ షేక్, తహసీల్దార్”

రారు.. పట్టించుకోరు

పంచాయతీ కార్యదర్శులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో కార్యదర్శులు ఇష్టారీతిగా వ్యవహరిస్తూ సమస్యలను గాలికొదిలేస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో ఎంతో కీలకమైన పారిశుద్ధ్యం, రిజిస్టర్ల నిర్వహణ వంటి పనులు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కార్యదర్శుల గ్రామాల సందర్శనేది?

- విధుల పట్ల నిర్లక్ష్యం..నిలిచిపోయిన పనులు
- గ్రామాల్లో పడకేస్తున్న పారిశుద్ధ్యం



కాంజీపూర్ పంచాయతీలో ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగునీరు

నారాయణఖేడ్: గ్రామాల్లో ప్రధాన ప్రథమ అధికారి పంచాయతీ కార్యదర్శి. తనకు కేటాయించిన గ్రామానికి సదరు కార్యదర్శి వెళ్లి ముఖగుర్తింపు హాజరును లైవ్ లొకేషన్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ, చాలామంది కార్యదర్శులు గ్రామాలకు వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటూ ముఖగుర్తింపు హాజరును నమోదు చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోతో ఇటీవల హాజరు నమోదు చేసిన ఘటన పత్రికల్లో రావడంతో రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా 553మంది పంచాయతీ కార్యదర్శులు నకిలీ హాజరు నమోదు చేసుకొన్నట్లు గుర్తించారు. ఇందులో 15మందిని సస్పెండ్ చేయగా మిగతావారికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోనూ ఇదే పరిస్థితి చాలా పంచాయతీల్లో కన్పిస్తోంది. కొన్ని పంచాయతీలకు కార్యదర్శులు ఇన్‌చార్జిలుగా కూడా ఉన్నారు. గ్రామాలకు సర్పంచ్‌లు ఉన్న సమయాల్లో విధులు బాగా నిర్వర్తించిన వీరంతా ఇప్పుడు ఆయా ఊళ్ల ముఖమే చూడటం లేదు. ఫలితంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడి సమస్యలు అక్కడే అపరిష్కృతంగా ఉంటున్నాయి.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ చేదోడు వాదోడుగా, గ్రామాభివృద్ధిలో కార్యదర్శులు భాగస్వాములు కావాలి. అయితే గ్రామాల్లో సర్పంచ్‌లు లేనికారణంగా పారిశుద్ధ్య, ఇతర కార్మికులతో పనులు కానిచ్చేస్తున్నారు. ఎప్పుడో చుట్టపుచూపుగా గ్రామాలకు అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారు. ప్రజలకు ఏదైనా పని ఉంటే వారికోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. కొందరు కార్యదర్శులకు మండల పరిషత్తుల్లో, ఉపాధి హామీ కార్యాలయంలోనే కాలక్షేపం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇవీ విధులు...

పంచాయతీ కార్యదర్శి విధుల్లో భాగంగా గ్రామానికి తాగునీటి సరఫరాను చేపట్టాలి. పారిశుద్ధ్యం, జనన, మరణాల నమోదు, ఇంటి పన్ను వసూళ్లు, ఇంటి నిర్మాణ అనుమతులు, వృత్తి, వ్యాపార లైసెన్సుల జారీ, పంచాయతీ కార్యాలయ నిర్వహణ, ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన వంటి పనులు చేపట్టాలి. వీటితోపాటుగా ప్రతీ గ్రామ పంచాయతీలో 58 రకాల రిజిస్టర్లను నిర్వహించాలి. అయితే కార్యదర్శులు గ్రామాలకు ముఖం చాటేస్తుండటంతో ఈ రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా జరగడంలేదు. పర్యవేక్షించాల్సిన మండల పరిషత్, జిల్లా స్థాయి అధికారులు కూడా వారి కార్యాలయాలకే పరిమితమవుతుండటంతో గ్రామాలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి.

క్లుప్తంగా

ఏకాగ్రతతో చదువుకోవాలి

ఉమ్మడి మెదక్ ప్రత్యేక అధికారి కిషన్

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటర్మీడియెట్ కీలక దశ అని, ఏకాగ్రతతో చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలని ఇంటర్మీడియెట్(బోర్డు) ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి కిషన్, జిల్లా అధికారి గోవింద్‌రామ్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని న్యాల్‌కల్, హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కళాశాలల్లో బాగా బోధించే అధ్యాపకులు ఉన్నారని, పాఠ్యాంశాలను శ్రద్ధతో చదువుకుని మంచి మార్కులు సాధించి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు జగదీశ్వర్, సదాలక్ష్మి, రాజాసింగ్, అర్జున్, శ్రీనివాస్, స్వర్ణలత, యాదగిరి, సోనీ, సిద్ధయ్య, కవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బామండ్ల రాజుకు డాక్టరేట్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ''నీలా జంగయ్య కవిత్వం-సమగ్ర పరిశీలన'' అనే అంశంపై పరిశోధనకు గాను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ సాధించినట్లు నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామానికి చెందిన బామండ్ల రాజు తెలిపారు. బుధవారం యూనివర్సిటీలో పై పరిశోధన పత్రాలను సమర్పించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందరావు పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నెల19న యూనివర్సిటీలో జరగనున్న 84వ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవవర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ చేతుల మీదుగా డాక్టరేట్ తీసుకోనున్నారు. రాజు ప్రస్తుతం సాంఘీక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో తెలుగు జేఎల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

మద్యం తాగి డ్రైవింగ్

డ్రైవర్‌పై కేసు నమోదు



డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జగదేవ్‌పూర్‌లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో మాస్టర్ మైండ్ ప్రైవేట్ పాఠశాల డ్రైవర్ మద్యం తాగి బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. చెక్ చేయగా 216 ఎంజి రావడంతో కేసు నమోదు చేశారు. పిల్లలను చక్కగా పాఠశాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత గల డ్రైవర్ మద్యం తాగడం దారుణమన్నారు. పాఠశాల యాజమాన్యం అవగాహన కలిగిన డ్రైవర్లను విధుల్లో పెట్టుకోవాలని సూచించారు.

ఛత్తీస్‌గఢ్ వాసి మృతి

హవేళిఘణాపూర్(మెదక్): పని చేసుకునేందుకు వలసవచ్చిన వ్యక్తి మృతి చెందాడు.ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. మెదక్ రూరల్ ఎస్ఐ మురళి కథనం ప్రకారం ... ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అనీల్‌కుమార్ (26) ఉపాధి కోసం వచ్చి మంభోజిపల్లి గ్రామంలో వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు. కొద్ది రోజులు పని చేసి వచ్చిన డబ్బులతో మద్యం తాగి జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో చిట్యాల వెళ్లే దారిలో ఉన్న ఖాళీ స్థలంలో నాలుగు రోజులుగా తిండి నిద్రాహారాలు లేక అపస్మారక స్థితికి చేరుకుని పడి ఉన్నాడు. ఎవరు గమనించకపోవడంతో మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

మహిళ మృతదేహం లభ్యం

సిద్దిపేటకమాన్: కాలువలో మహిళ మృతదేహం లభ్యమైన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... రంగనాయక సాగర్ కాలువలో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ మార్చురీకి తరలించారు. మృతిచెందిన మహిళ ఇమాంబాద్‌కు చెందిన రాణి (37) గా గుర్తించారు. ఈ ఘటనపై ఇప్పటివరకు ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

గ్యాస్ లీకై మంటలు..

ముగ్గురికి గాయాలు

ఝరాసంగం(జహీరాబాద్): గ్యాస్ లీకై మంటలు చెలరేగి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, స్థానికుల కథనం ప్రకారం... ఏడాకులపల్లి గ్రామంలో ఓ ఇంట్లో గ్యాస్ పైపు లీకై మంటలంటుకున్నాయి. దీంతో ఇంట్లో ఉన్న శంకరమ్మ, ఆమె కుమారులు ప్రభు కుమార్, విట్టల్‌కు మంటలంటుకుని గాయాలయ్యాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గమనించిన గ్రామస్తులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం మొదట జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కారు, బైక్ ఢీ..

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన తోడేల్ మల్లేశ్ బైక్‌పై రామాలయం వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో గ్రామం నుంచి ఎదురుగా వచ్చిన కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న మల్లేశ్‌కు కాలు విరగగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

మగ్గంపై అద్భుతం..

గొల్లభామ శోభితం

నేడు చేనేత దినోత్సవం సందర్భంగా అవార్డుల ప్రదానం

- చేనేతలకు దక్కిన ప్రతిఫలం
- గొల్లభామ, ముత్యంపేటలకు చోటు
- అవార్డుల ప్రకటనతో చేనేత కార్మికుల ఆనందం

జిల్లా చేనేత కార్మికుల వృత్తి నైపుణ్యాలకు ప్రతిఫలం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రకటించే కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారక అవార్డులలో సిద్దిపేట నేతన్నల పనితనాన్ని గుర్తించారు. పట్టణానికి చెందిన బైరి శ్రీనివాస్, మంతూరి వెంకటేశం, దుబ్బాకకు చెందిన రాజేశంను అవార్డులకు ఎంపిక చేశారు. గురువారం హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వారికి రూ.25వేల నగదు, ప్రశంసాపత్రాలతో సత్కరించనున్నారు. వారు నేసిన ప్రత్యేక చీరలు, వారి వత్తి నైపుణ్యాలపై సాక్షి కథనం... – సిద్దిపేటజోన్



గొల్లభామ చీర



నాలుగు దశాబ్దాలుగా..

సిద్దిపేట పట్టణానికి చెందిన బైరి శ్రీనివాస్ కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఆరు పదులు దాటినా ఆయన 40 ఏళ్లుగా చేనేత వృత్తిలో కొనసాగుతున్నాడు. మొదట్లో అప్పటి పరిస్థితులకు అనుగుణంగా పాలిస్టర్ బట్టలు, కాలక్రమేణా ఫ్యాబ్రిక్, ట్విట్ క్లాత్, గొల్లభామ చీరలు నేస్తున్నాడు. ఇటీవల అతను తయారీ చేసిన సికో(సిల్క్ అండ్ కాటన్)గొల్లభామ రాష్ట్ర అవార్డుకు ఎంపికైంది. చీర అంచులో గొల్లభామ బొమ్మలు, అక్కడక్కడా రామప్ప పువ్వులతో, అడవికి సంబంధించిన బొమ్మలు చీరలో ప్రత్యేకం. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన కష్టానికి ప్రతిఫలం, గుర్తింపు లభించిందన్నాడు. చీర నేయడానికి 4 రోజులు పట్టిందని, ప్రభుత్వం సహకారం అందిస్తే మరింత నైపుణ్యంగా చీరలను తయారీ చేస్తానని పేర్కొన్నాడు.

లెనిన్, చిట్కీ చీరల తయారీలో నిష్ణాతుడు



దుబ్బాక: నాగరికతకే నగిషీలు చెక్కినారు మనవాళ్లు.. తరాల నుంచి నమ్ముకున్న చేనేత వృత్తిలో స్వతహాగా తనదైన శైలి, నైపుణ్యంతో వస్త్రాల తయారీలో అద్భుతాలు సృష్టిస్తున్నాడు దుబ్బాక పట్టణానికి చెందిన పేద చేనేత కార్మికుడు జిందం రాజేశం. ప్రస్తుతం 59 ఏళ్ల ఉన్న ఆయన కులవృత్తి చేనేత వైపు అడుగులు వేశాడు. 45 ఏళ్లుగా మగ్గాన్నే నమ్ముకుని ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నాడు. ఆయన జకార్డ్ మగ్గంపై నేసిన ఆర్మూర్ సిల్క్ పట్టుచీరకు గాను.. ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపిక చేసింది. నెలరోజుల పాటు కష్టపడి ఆలయం ఆకృతిలో ఆర్మూర్ పట్టుచీరను నేశాడు. ఎంతో అద్భుతంగా ఆలయం ఆకృతిలో తయారుచేసిన పట్టుచీర కొంగు, మధ్యభాగం ఆలయం ఆకృతి ఉండగా అదనంగా బుట్టాలు తీర్చిదిద్దారు. రాజేశం నేడు హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారంతో పాటు రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రం అందుకోనున్నారు. ప్రస్తుతం దుబ్బాక చేనేత సంఘంలో రుమాళ్లు, బెడ్ షీట్స్, లెనిన్, చిటికీ చీరలతో పాటు వివిధ రకాల వస్త్రాలు నేస్తుంటారు. ఆర్మూర్ పట్టుచీరకు అవార్డు రావడం జీవితంలో మరచిపోలేని అనుభూతి అని ఆయన తెలిపారు.



ముత్యం పేటతో కొత్త ఒరవడి..

సిద్దిపేట పట్టణానికి చెందిన **మంతూరి వెంకటేశం** గత 50 ఏళ్లుగా చేనేత కార్మికుడిగా సాగుతున్నాడు. సిద్దిపేట చేనేత సహకార సంఘంలో సభ్యుడిగా ఉన్న ఆయన గత 28 ఏళ్ల పాటు గొల్లభామ చీరలు తయారు చేస్తున్నాడు. కొత్తగా ఉండాలని ముత్యంపేట చీరలు కూడా నేస్తున్నారు. చీర అంచులో 25 బుట్టలు అందంగా నేశాడు. ఈ చీర నేయడానికి 4 రోజుల సమయం పట్టింది. ప్రభుత్వం ఈసారి ముత్యంపేట చీరకు అవార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొత్తదనం ఉండాలని, మహిళలకు ఇష్టమైన ముత్యాల బొమ్మలతో చీర నేసినట్టు తెలిపారు. ప్రభుత్వం గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

సిద్దిపేటరూరల్: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టి అధిక లాభాలు పొందాలని ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ భాస్కర్‌రెడ్డి, ఏఓ పరుశురాంరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం నారాయణరావుపేట మండల పరిధిలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన రైతు రవీందర్ ఆయిల్‌పామ్ తోటలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటలో అధికలాభాలు ఏవిధంగా పొందవచ్చు? ఎరువుల మోతాదు, నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నూతనంగా సాగు చేసే ఎస్సీ రైతులకు వందశాతం, బీసీలకు 90శాతం, ఓసీలకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. దీంతోపాటు పంట నిర్వహణకు రూ.4200 ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు వరుణ్, మౌనిక, అఖిల, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ర్యాలీ

అదనపు కలెక్టర్, తహసీల్దార్‌కు వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక చౌరస్తా నుంచి గ్రామ ప్రధాన వీధుల గుండా, తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం, బీజేపీ నాయకులు అదనపు కలెక్టర్ నాగేశ్, తహసీల్దార్ తులసిరామ్‌కు వేర్వేరుగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బి.శంకర్ మాట్లాడుతూ... ఉన్నత విద్య కోసం సరైన వసతులు లేకపోవడంతో, విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. చాలామంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు సిద్దిరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, మాజీ మండల అధ్యక్షుడు నవీన్, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, జనరల్ సెక్రటరీ సేనాపతి, సెక్రటరీ బాలరాజ్ గౌడ్, మండల నాయకులు అశోక్, వడ్డె రాములు, పట్టణ అధ్యక్షుడు వెంకట్, బూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, లింగం, వీరేశం ల్గొన్నారు.

ఎండు గంజాయి స్వాధీనం

ముగ్గురు అరెస్ట్



నిందితులతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

మునిపల్లి(అందోల్): ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ హనుమంత్ యాదవ్ కథనం ప్రకారం.. బుధవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో పటాన్‌చెరు మండలం ఇస్మాయిల్‌పూర్‌కు చెందిన వీరేశ్, సాయికిరణ్ రెడ్డి, రాహుల్ అనే ముగ్గురు వ్యక్తులు బీదర్ నుంచి 1.145 కేజీల గంజాయిని కారులో అక్రమంగా తీసుకొస్తుండగా పట్టుకున్నారు. గంజాయి, 4 సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. వాహన తనిఖీల్లో కానిస్టేబుల్స్ అంజిరెడ్డి, అరుణజ్యోతి, శివా, రాజేశ్ పాల్గొన్నారు.

భవనంపై క్రేన్‌ను సరిచేస్తుండగా..

కిందపడి ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



ఎండీ.జావిద్ మృతదేహం

పెద్దశంకరంపేట(మెదక్): భవనం పైనుంచి కిందపడి యజమాని మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా... తిరుమలాపూర్ కాలనీలో అన్నాతమ్ముళ్లు కలిసి నూతన భవనం నిర్మిస్తున్నారు. వీరిలో ఎండీ.జావిద్(40) నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నాడు. భవనంపై సామగ్రిని చేరవేసే క్రేన్‌ను జావిద్, పాపన్నపేట మండలం చీకోడ్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు శంకర్‌తో కలిసి సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పైనుంచి ఇద్దరు కిందపడిపోయారు. దీంతో జావీద్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, శంకర్‌కు తీవ్రగాయాలు కాగా అతడిని సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అల్లాదుర్గం ఎస్ఐ.శంకర్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడంటూ..

సిద్దిపేటజోన్: వైద్యుల నిర్లక్ష్యం వల్లే వ్యక్తి చనిపోయాడని మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. బాధితుల కథనం ప్రకారం... చేర్యాల మండలం నాగపూరి గ్రామానికి చెందిన మల్లిగారి మురళి(37)అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. ఆయనను పరీక్షించిన డ్యూటీ డాక్టర్ రక్తం అవసరముందని, ప్లేట్‌లెట్స్ తగ్గినట్టు మురళి బంధువులకు చెప్పాడు. పరిస్థితి విషమించి అర్ధరాత్రి 2 గంటల సమయంలో అతడు చనిపోయాడు. విషయం తెలుసుకున్న బంధువులు బుధవారం ఉదయం మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. తన భర్త మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని, న్యాయం చేయాలని మృతుడి భార్య అండాలు ఆరోపించింది.

ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బంధువుల ధర్నా



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

మొక్కలతోనే జీవవైవిధ్యం



మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త సుధాకర్‌రెడ్డి

ఇస్రో శాస్త్రవేత్త సుధాకర్‌రెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: జీవ వైవిధ్య శాస్త్రానికి మొక్కల వర్గీకరణ ఎంతగానో ఉపయోగపడుతుందని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల బాటనీ విభాగం ఆధ్వర్యంలో జీవవైవిధ్య శాస్త్రం – మొక్కల వర్గీకరణ, పరిణామం, భవిష్యత్ అనే అంశంపై రెండ్రోజుల వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. మొక్కలను గుర్తించడానికి ఉపయోగించే సాంకేతిక పరికరాలు, జీపీఎస్, జీఐఎస్‌ల పనితీరు, మొక్కల పరిణామ క్రమంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు వివరించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ రాజు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహమూర్తి జీవవైవిధ్యం, సంరక్షణ పద్ధతుల గూర్చి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సీఓఈ డాక్టర్ గోపాలసుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ రాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శైలజ, ఆయా యూనివర్సిటీల ప్రొఫెసర్లు, అధ్యాపకులు, రీసర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న గిరిజన పాఠశాల

ఏసీబీ అధికారుల ఆకస్మిక తనిఖీ

నర్సాపూర్ రూరల్: మండలంలోని మహ్మదాబాద్ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల కంపు కొడుతుందని ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. బుధవారం నర్సాపూర్ మండలంలో ఉన్న పాఠశాలను ఏసీబీ సీఐలు రమేశ్, వెంకటేశ్వర్లు, జిల్లా తూనికలు, కొలతల అధికారి అనిల్ కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాల ఆవరణ, వంట గదులు, తరగతిగదులు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. మెనూ ప్రకారం వంట చేయడం లేదని చెప్పారు. ఆవరణ పూర్తిగా పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా ఉందన్నారు. సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదికను తయారుచేసి అందజేస్తామని తెలిపారు.



పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

హోటళ్లలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



హోటల్ కిచెన్‌ను పరిశీలిస్తున్న సీఐ

గజ్వేల్‌రూరల్: హోటళ్ల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించి ప్రజరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఐ రవి కుమార్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోని పలు హోటళ్లను బుధవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటళ్లలోని పరిసరాలను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే హోటళ్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వ్యసనాలకు బానిసై.. అన్న ఇంట్లో చోరీ

- తమ్ముడి అరెస్టు.. రిమాండ్
- 7 నెలల తర్వాత కేసు ఛేదన

దుబ్బాక: సొంత అన్న ఇంట్లో తమ్ముడు చోరీకి పాల్పడ్డాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఎస్ఐ కీర్తి రాజు స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. మున్సిపల్‌లోని మల్లాయపల్లి ఒకటవ వార్డులో జనవరి15న మేస్త్రీగా పనిచేసే కీసరి రమేశ్ ఇంట్లో పావు తులం బంగారం , 4 తులాల వెండి, రూ.15 వేలను గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. అదే నెల 17న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు 7 నెలల తర్వాత సొంత తమ్ముడు కీసరి రాజు చోరీకి పాల్పడ్డట్లు గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించగా వ్యసనాలకు బానిసై తానే చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు.

విద్యార్థిని చితకబాదిన టీచర్

- ముఖంపై గాయం
- ఎంఈఓకు ఫిర్యాదు



విద్యార్థి ముఖంపై గాయం

రేగోడ్(మెదక్): ఎలాంటి కారణం లేకుండా విద్యార్థిని ఓ టీచర్ చితకబాదాడు. ఈ ఘటన మెదక్ జిల్లా రేగోడు మండల కేంద్రంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థి వివరాల ప్రకారం.. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కార్తీక్‌రెడ్డి రేగోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం కూడా పాఠశాలకు వెళ్లాడు. తరగతి గదిలో ఉన్న ఉపాధ్యాయుడు అల్లరి చేస్తున్నానంటూ తనపై దాడి చేశాడని ఎంఈఓకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ముఖంపై చేతితో కొట్టడంతో గాయమైందని వాపోయాడు. మనసులో ఏదో కక్ష పెట్టుకునే దాడి చేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి తండ్రి సంజీవరెడ్డి ఉన్నతాధికారులను కోరుతున్నాడు.

విదేశీ విద్యకు ఇద్దరు ఎంపిక

ములుగు ఉద్యాన వర్సిటీ వైస్ చాన్సలర్ రాజిరెడ్డి వెల్లడి



వీసీతో ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ములుగు(గజ్వేల్): విదేశాల్లో ఉద్యాన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ములుగు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్. దండా రాజిరెడ్డి పేర్కొన్నారు. రెండేళ్ల ఎంఎస్సీ హార్టికల్చర్ కోర్సును చదివేందుకు ఇద్దరు విద్యార్థులు అమెరికాలోని అబామ వర్సిటీకి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ నెల 12న వారు అమెరికాకు వెళ్తున్నట్లు తెలిపారు. ఎంపికైన రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల విద్యార్థి ఎస్ రేచల్, వనపర్తి జిల్లా మోజెర్ల ఉద్యాన కళాశాల విద్యార్థి హర్షిత బుధవారం తల్లిదండ్రులతో కలిసి వీసీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం లివింగ్ ఖర్చులు, ట్యూషన్‌ఫీజు, మెడికల్ ఇన్సూరెన్స్ తదితర ఖర్చులను భరిస్తుందన్నారు. ఒక్కో విద్యార్థికి సుమారు రూ.55 లక్షలు వెచ్చిస్తుందని వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు చీనా, భగవాన్, శ్రీనివాసన్, ప్రశాంత్, సైదయ్య, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు..

ఒక జేసీబీ, మూడు ట్రాక్టర్లు స్వాధీనం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామ శివారులో మల్లన్న సాగర్ కాల్వ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజేశ్ వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి అనుమతి లేకుండా నందిగామ గ్రామానికి చెందిన రాగుల చంద్రం, రాజశేఖర్, గౌరిమల అంజయ్య, జేసీబీ, మూడు ట్రాక్టర్‌లతో మట్టిని తరలిస్తుండగా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు, వాహనాల యజమానులపై కేసు నమోదు చేశారు.